శ్రీ కలువకొలను సదానంద

# కోడుకూ - కోమలీ

కొండ పైకి వెళ్లే బస్సెక్కి కూర్చోగానే, కళ్లలో మెదిలేది గోవిందుడే! మొట్టమొదటి సంపాదన — దిన జీతం పన్నెండు రూపాయలు చేతిలో పడగానే, గుండె చాటున తచ్చాడే కోమలి గుడిసె తలుపు తెరిచి చిరునవ్వుల మరుమల్లెలు పరిచి స్వాగతం చెబుతున్నట్లున్న ఊహా చిత్రం తప్ప మరేదీ పొడగట్ట లేదు, హనుమంతు కళ్ళకు!

నరుడి కోరిక తీర్చే పాతాళ భైరవిని పదిలపరచుకున్నట్లుగా పన్నెండు రూపాయల్ని పంట్లాం వెనక జేబులో దోపుకుంటూ, గేటు దాటి రోడ్డుమీది కొచ్చాడు హనుమంతు. పిచ్చెక్కిన గుర్రాల గుంపులా పరుగులు తీస్తోంది రోడ్డు. మైలున్నర దూరం లోనే వుంది గూడెం. ఏం చెయ్యాలో తోచని హనుమంతుకు మాత్రం రోడ్డుమీద కాళ్ళు సాగలేదు.

'ఏయ్! ఏంటేదీ! వొదులూ!' ... పది రోజుల క్రితం గుడిసెలో దూరి తాను కోమలిని వాటేసుకున్నప్పుడు ఆమె అనిన ఆ మాట గుర్తుకొచ్చి, అతడి నరాలు జివ్వుమన్నాయి. ఆ మెత్త దనాలన్నీ మళ్ళీ ఓమారు ఒంటిమీద పారాడినట్లనిపించి పులకించి పోయాడతను.

ఇరానీ హోటల్లో టీ తాగి, సిగరెట్లు రెండు కొనుక్కుని గుప్పు గుప్పున పొగవదుల్తూ సినిమాకు బయలుదేరాడు. సినిమా బాగుంది. అందులో రేప్ సీను బావుంది. హీరో హీరోయిన్ల శృంగారం బావుంది. హీరోయిన్ అందచందాలు బావున్నాయి. ఆమె హీరో కౌగిట్లో ఒదిగిపోయినప్పుడల్లా హనుమంతు కుర్ర వయసు బావురుమంటూ ఏడవసాగింది. ఆ కౌగిలి తనదైతే ఎంత బాగుంటుంది! అందరాని చందమామ ఆ హీరోయిన్! కౌగిట్లో యిముడ్చుకుంటే కోమలి చాలుగదా, హీరోయిన్ వంపుసొంపుల్నీ, ముద్దు మురిపాలనీ తలపింపజేయటానికి?

కోమలికి పెళ్ళయింది. పెళ్ళయిన రెండేళ్ళకే పసుపు కుంకం చెరిగిపోగా, పుట్టింటికి తిరిగొచ్చి, ఏకాకిగా వుంటున్న ముసలి తండ్రికి తోడుగా వుంటోంది. గూడెంలోని కోడెకారు చిన్నవాండ్రు కొందరు కోమలి సందిట్లో వయసు పొంగుల వేడి నురగల మీగడ తరగల్ని రుచిచూశారన్న గుసగుసలు గొంతెత్తి చెవిలో కుయ్యిలిడ కుండా వుండివుంటే, హనుమంతు ఆ రోజు ఆమెను అలా వాటేసుకుని వుండేవాడు కాదు. అంత ధైర్యంచేసినా, వేడి నురగల రుచి తన నోటికి అందనే లేదు. ఆమె తనను విదిలించిపారేసి, పైట సవరించుకుని, "కడుపు కూటికేడిస్తే, కొప్పు పూలకేడ్చిం దంట! రూపాయి సంపాయించే బగిసి లేనోడికూ్కడా ఆడది గావాల! ఓ యబ్బో మొకం జూడు! నేనేం బండమింద రోలను కుంటివా, తేరగా దంచుకుపోటానికి? పో!" అంటూ ఈసడించింది.

జేబులో డబ్బులున్నాయి, ఇప్పు డేమంటుందో కోమలి?.... ఏమంటుంది? 'శుభం' అంటూ శకునం పలికింది వెండి తెర.

హనుమంతు ఇరానీ హోటల్లో చికెన్ బిరియానీ తిని బిల్లు చెల్లించి, మిగిలిన డబ్బు లెక్కపెట్టుకున్నాడు. ఆరు రూపాయలున్నాయి. ఫరవాలేదు, కోమలి ఈసడించుకోదు. పగ బట్టి ముసురుకుంటున్న వెన్నెల వేడిని సిగరెట్టు దమ్ములతో తడిపేసుకుంటూ గూడెం చేరుకున్నా డతను.

మకుక్కుతూ, మూలుగుతూ గుడిసె బయట అరుగుమీద కడుపులో కాళ్లు ముడుచుకుని పడుకున్న మునెయ్య కళ్ళల్లో చుక్కలు మెరిశాయి. "అబ్బోబొచ్చేసినాడే లచ్చిమీ!..... ఇంత రేతిరిదాకా ఏంజేస్తా వుంటివిరా నాయినా, తొందరగా యింటికి రాకుండా?"

"టౌన్‌లో వుంటి! ...." హనుమంతు కాళ్ళు కడుక్కుని యింట్లోకి వెళ్ళాడు. పంట్లామూ చొక్కా విప్పి గోడకు తగి లించాడు. నాలుగు మూరల పంచె కట్టుకుని, సిరిచాప పరుచు కున్నాడు.

"అదేందిరా! తినకుండా పండుకుంటావా? నాలుగు గంజి మెతుకులుండాయి, రా!" అంది లచ్చిమి.

"వొద్దులేమే! నిద్దరొస్తావుంది నాకు. మీరు తాగెయ్యండి!" కళ్ళు మూసుకుని బోర్లపడుకున్నాడు హనుమంతు. తాను వద్దన్న

గంజి అమ్మా అయ్యా తాగారో లేదో అతడు గమనించలేదు. లచ్చిమి దీపం ఆర్పేసి పడుకుంది.

అరగంట గడిచాక, హనుమంతు పైకిలేచి వాకిట్లోకి వచ్చాడు. వెన్నెల గంగవెర్రులెత్తినట్లు గంతులు వేస్తోంది. చందమామ కప్పుకున్న మేలిముసుగులా ఇరవై బారల దూరంలో కోమలి గుడిసె కనిపిస్తోంది. వెన్నెల్లో వేగిపోతూ విసవిసా నడిచాడు హనుమంతు. గుడిసె బయట గంగిరేణి చెట్టుకింద నులక మంచంలో ఒదిగిపోయి గురక తీస్తున్నాడు, కోమలి తండ్రి రాజయ్య. హనుమంతు మెల్లగా ఒడిసె తలుపు తట్టాడు.

తెరుచుకున్న తలుపు సందులో నుంచీ మైనపు ముద్దలా కరిగి మాయమై పోయాడు.

ఇదంతా చూస్తూనే వున్నాడు మునెయ్య.

◆ ◆

కోమలి గుడిసెలోంచి బయటపడి, కొడుకు ఇంట్లోకి రావటాన్ని చూడవలసివస్తుంది కదా అన్న సిగ్గుతో మూసిన కన్ను తెరవలేదు మునెయ్య.

తెల్లవారింది.

పెదవి విప్పటానికి ఓపికలేనట్లు, నిలబడటానికి తీరికలేనట్లూ, కాళ్ళకు చక్రాలు తొడుక్కున్న వాడిలా తొందర తొందరగా టౌనుకు వెళ్ళిపోయాడు హనుమంతు.

లచిమి కూలికి వెళ్ళింది. ఒంట్లో శక్తి ఉడిగిపోయి, పనీ పాటా చేసుకోలేని స్థితికివచ్చిన మునెయ్య ఇంట్లోనే కూర్చున్నాడు.

పొద్దు గూట్లో పడేదాకా లచ్చిమి తిరిగిరాదు. క్రితంరోజు నాయుడుగారు ఆమెకు కూలిడబ్బులు యివ్వనేలేదు. పాతబాకీ కింద చెల్లువేసుకున్నాడు. అందుచేత, కాలే కడుపును నిన్న గంజి నీళ్ళతో చల్లార్చుకోవలసి వచ్చింది. పాపం, పరగడుపుతోనే పనికి వెళ్ళింది లచ్చిమి.

మధ్యాహ్నం కాగానే మునెయ్య కడుపులో ఆకలి అగ్గిగా మారింది. మంచినీళ్ళు ముంచి తాగుతుంటే, రాజయ్య యింటి వాకిట్లో నుంచి కోమలి కేకవేసి పిలవటం వినిపించింది. "మావోఁ! ఓ మునెయ్యమావోఁ!"

"ఏవేఁ?" అంటూ బయటికి తొంగిచూశాడు మునెయ్య.

"ఇట్రా! అయ్య రమ్మంటావుండాడు."

తలుపు గొళ్ళెంపెట్టి ఆ యింటికి వెళ్ళాడు మునెయ్య.

"ఏందిరా రాజిగా?"

"కూరోన్నా!....అయిపోయిందంటే కోమలా?"

"ఇదో! ఎంతసేపులే, ఇంకొక్క నిమషం!"

"కానీ మరి!....నీ కొడుక్కేందో ఉద్యోగ మొచ్చిందంట గదరా మునెయ్యా?"

"ఆఁ పదోతరగతి పరీక్ష తప్పినోడికి ఏముద్యోగమొస్తుందిలే?....సదువుకు సున్నజుట్టి ఐదారేండ్లు బసవెద్దు మాదిరిగా తిరిగినాడు. ఇప్పుడదేందో చిన్న నౌకరీ ఏసినారు. ఏ పొద్దు జీతం ఆ పొద్దే యిచ్చేస్తారంట! నిన్నట్నుంచీ మొదులు! అదయినా, పరిమినెంటుగాదు. రెండు మూణ్ణెల్లుంటే జాస్తి."

మాటల మధ్యలోనే, అన్నంలో వేడివేడిగా కూరపోసి రెండు కంచాలు తెచ్చి వాళ్ళముందర పెట్టింది కోమలి.

"తినరా మునెయ్యా!....పావుకిలో మాంసందెచ్చి కూర జేసింది. ఉడికింది గదా, పెట్టమ్మీ అంటే, మావఁరానీ మావఁ రానీ అని ఒకటే పాట!"

నోట్లో వూరుతున్న నీటిని గుటకవేస్తూ, పొగలు కక్కుతున్న కూరలో చెయ్యి పెట్టాడు మునెయ్య.

"ఏమంటివీ? పరిమినెంటుద్యోగం కాదంటావా? ఏదో ఒకటి! మంచికాలం రాకుండానే పోతుందా? చెట్టంత కొడుకు-సాకి సంతరించేస్తాడు. నాకూ ఒక కొడుకు లేకపోయె. ఈ తిప్పలుండేవి కావు మాకు!"

మునెయ్య నోట్లో నీళ్ళూరటం ఆగిపోయింది. ముద్ద నోటికి వెళ్ళలేదు. "ఏమీ అనుకోబాకరా రాజయ్యా! ఒళ్ళు అదోక మాదిరిగా వుంది. నేను తిన్లేను." అంటూ పైకిలేచాడు. చరచరా బయటకు వచ్చేశాడు.

అతడి వెనకే గుమ్మందాటి వచ్చిన కోమలి "ఏం మావాఁ? నా చేతి కూడు తినగూడదా?" అని అడిగి, టక్కున తల వంచుకుంది.

"ఛా, అదేం మాటే? నీ చేతికూడు తినాలంటే అడిగి రావాల! అదురుష్ట మంటే మీ అయ్యదేనే! నా కొడుకు నాకు బెట్టాల్సిన కూడే అది. దాన్ని నువ్వు పెడ్తే తినాల్సొచ్చింది గదా అని సిగ్గుగా వుంది. ఒసే కోమలా! నువ్వు ఆడపిల్లయితే మాత్రం ఏవేఁ? బుద్ధిమంతురాలివి! తప్పో ఒప్పో, నీకు చేతనైన పన్జేసి, ఏ దిక్కూలేని తండ్రికి పట్టెడు కూడు బెడతా వుండావు. నీ అయ్యకు నువ్వు కూతురివి గావు, కొడుకువి! దయ అనేది లేకపోతే కొడుకెందుకే, నీ బోటి కూతురు మేలు!" అంటూ ఆమె తల నిమిరి, చెమర్చే కళ్ళతో గుడిసెవైపు నడిచాడు మునెయ్య.